

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -167 పేజీలు - 8 వెల ₹03/- గురువారం 24 సెప్టెంబర్ 2026

ఎనిమిదేళ్లలో ఆయుష్మాన్ భారత్.. కుటుంబాలకు రూ. 2 లక్షల కోట్ల ఆదా



ఆయుష్మాన్ భారత్ పథకానికి ఎనిమిదేళ్లు పూర్తి

60 కోట్ల మంది కి రూ. 5 లక్షల వార్షిక ఆరోగ్య రక్షణ

దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ఏర్పాటు

ఈ నెట్‌వర్క్‌లో 38,000కు పైగా ఆసుపత్రులు భాగం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం విజయవంతంగా ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం స్పందిస్తూ.. మిగతా 2లో...



జూరాలకు నీటి విడుదలకు ఓకే

జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం

విడతల వారీగా 3 టీఎంసీలు ఇచ్చేందుకు సీఎం డీకే శివకుమార్ సుముఖత

బెంగళూరులో కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల బృందం భేటీ

జూరాల కింద రైతుల ఇబ్బందులను వివరించిన మంత్రులు జూపల్లి, శ్రీహరి

హైదరాబాద్ సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):
తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మిగతా 2లో...



కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు

తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం

రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి

మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర

అమరావతి సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):
ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా మిగతా 2లో...



ఈసీల నియామకంపై సుప్రీం భిన్న తీర్పు

విస్తృత ధర్మాసనానికి పంపడంపై ఇద్దరు న్యాయమూర్తుల మధ్య విభేదం

రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుపై సీజేఐకి సిఫారసు



న్యూఢిల్లీ సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):
ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీలు) నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం భిన్న తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న కేంద్ర మిగతా 2లో...

కొత్త ఇంచార్జ్‌లు

28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం

ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్వింద్ ధర్మపురి

తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్ -ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి



న్యూఢిల్లీ సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):
రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయమిగతా 2లో...

రైలు ఢీకొని నలుగురు విద్యార్థుల దుర్మరణం

శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఘోర రైలు ప్రమాదం

భారీ వర్షం కారణంగా రైలు రాకను గమనించలేకపోయిన విద్యార్థులు

పట్టాల సమీపంలో చేపలు పడుతుండగా జరిగిన దుర్ఘటన

మరో విద్యార్థికి తీవ్ర గాయాలు..



వాయుగుండం ముప్పు

ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరం వైపు వేగంగా పయనం

కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం

విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుందని అంచనా

తీర ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తం

అమరావతి
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తరాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం, రాగల కొన్ని గంటల్లో తీరాన్ని తాకనుంది. బుధవారం రాత్రి ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. మిగతా 2లో...



డీఎస్సీ మెగా స్కామ్..

సీబీఐ విచారణ జరిపించండి

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కిజగన్ ఫిర్యాదు

అమరావతి, సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):
డీఎస్సీ అక్రమాలపై విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారని, ఈ సందర్భంగా తమ నేతలపై దాడి జరిగిందని వైసీపీ అధినేత జగన్ నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. డీఎస్సీ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని జగన్ డిమాండ్ చేశారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, డీఎస్సీ కుంభకోణం ఎలా మిగతా 2లో...



తెలంగాణ ఉద్యోగులకు రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం

అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు

ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు

పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం



రాయలసీమకు లక్ష కోట్ల వరం..

అక్టోబర్ 2న హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన


లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ఆరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలు

నిర్మలా సీతారామన్‌తో కలిసి ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

రిలయన్స్ ఏర్పాటు చేయనున్న అగ్రికల్చర్ స్కూల్‌కు కూడా అంకురార్పణ

వరుస కార్యక్రమాలతో ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు బిజీ బిజీ

అమరావతి సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):
దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న రాయలసీమ రూపురేఖలను మార్చే బృహత్తర ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు లక్ష కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది. మిగతా 2లో...



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

రాయలసీమకు లక్ష కోట్ల వరం..

మొదటిపేజీ తరువాయి

అక్టోబర్ 2వ తేదీన మదనపల్లెలో జరిగే కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా సీమ రైతాంగ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం కింద ఈ రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు అందనుండగా, మరో రూ.60 వేల కోట్లను ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించనున్నారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు.

ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి నీరందిస్తూనే, మరోవైపు ఉద్యానవన పంటలను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతాల్లో సంపద సృష్టించి, రైతుల ఆదాయాన్ని పెంచడమే ఈ హబ్ ప్రధాన ఉద్దేశం. ఇదే కార్యక్రమంలో భాగంగా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయ రంగంలో అత్యున్నత ప్రమాణాలతో ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.

వరుస కార్యక్రమాలతో సీఎం బిజీ

ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటూ తీరిక లేకుండా గడపనున్నారు.

సెప్టెంబర్ 29: ఉదయం విజయవాడలో జరిగే ణ్ణూా కర్మయోగి మిషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నిర్వహించే 'పల్లె పండుగ'కు హాజరవుతారు.

సెప్టెంబర్ 30: విజయవాడలో 24 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

అక్టోబర్ 1: రాష్ట్రవ్యాప్తంగా జరిగే 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు.

అక్టోబర్ 2: గాంధీ జయంతి సందర్భంగా ఉదయం మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం విజయవాడలో జరిగే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.

అక్టోబర్ 3: విజయవాడలో జరిగే పాన్ ఐఐటీ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ వరుస కార్యక్రమాలతో సీఎం ఐదు రోజుల పాటు ప్రజలతో మమేకం కానున్నారు.

కొత్త ఇంచార్జ్‌లు

మొదటిపేజీ తరువాయి

అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు.తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

ఆంధ్రప్రదేశ్: అర్వింద్ ధర్మపురియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

తమిళనాడు: రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా,



కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురానా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

ఎనిమిదేళ్ల ఆయుష్మాన్ భారత్..

మొదటిపేజీ తరువాయి

ప్రతి భారతీయుడికి నాణ్యమైన, అందుబాటు ధరలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఈ పథకం ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంగా నిలిచిందని ఆయన కొనియాడారు.

ఈ విషయంపై ప్రధాని మోదీ సోషల్ మీడియా 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "ఎనిమిదేళ్ల క్రితం, ప్రతి భారతీయుడికి అత్యుత్తమ, అందుబాటు ధరలో వైద్యం అందాలనే ఆలోచనతో ఆయుష్మాన్ భారత్ ప్రారంభమైంది. ఈ రోజు, 60 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఏటా రూ. 5 లక్షల ఆరోగ్య కవరేజీ అందుబాటులో ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం" అని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చులు రికార్డు స్థాయిలో ఆదా అవుతున్నాయని ప్రధాని తెలిపారు. అంతేగాక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ద్వారా వైద్య సేవలు ప్రజల ముంగిటకే చేరుతున్నాయని, ఇప్పటికే ఈ కేంద్రాల్లో 500 కోట్లకు పైగా సందర్శనలు నమోదయ్యాయని ప్రధాని వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ బలపడుతోందని ఆయన అన్నారు.ఆయుష్మాన్ భారత్ ఎనిమిదేళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను MyGovIndia కూడా తన పోస్టులో వివరించింది. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) కింద అందించిన ఉచిత చికిత్సల వల్ల కుటుంబాలకు రూ. 2 లక్షల కోట్లకు పైగా వైద్య ఖర్చులు ఆదా అయ్యాయని తెలిపింది. దేశవ్యాప్తంగా 38,000కు పైగా ఆసుపత్రులు ఈ నెట్‌వర్క్‌లో భాగమయ్యాయని, ఇప్పటివరకు 13 కోట్లకు పైగా హాస్పిటల్ అడ్మిషన్లు జరిగాయని పేర్కొంది.

70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లను వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చారు. మొత్తం ఆయుష్మాన్ కార్డుల్లో దాదాపు సగం మహిళల పేరు మీద ఉండటం గమనార్హం.

ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా మధుమేహం, రక్తపోటు కోసం 42 కోట్లకు పైగా స్క్రీనింగ్‌లు, అలాగే నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల కోసం కోట్ల సంఖ్యలో పరీక్షలు నిర్వహించారు.

ఈ పథకం పోర్టబిలిటీ సదుపాయం ద్వారా లబ్ధిదారులు తమ సొంత రాష్ట్రం వెలుపల కూడా రూ. 8,800 కోట్లకు పైగా విలువైన 30 లక్షలకు పైగా చికిత్సలు పొందారని వీఎ+శీజ×అఎఱఱ వెల్లడించింది. మొత్తంగా, 60 కోట్ల మందికి రూ. 5 లక్షల ఆరోగ్య బీమా అందిస్తూ, తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో ఈ పథకం ఆర్థిక భద్రతను కల్పిస్తోంది.

కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు

మొదటిపేజీ తరువాయి

ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు.

డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది.

ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది.

కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు.

ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు.

చిన్న రైతులకు భరోసా: భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది రాజధాని రైతులకు ఎష్ణన ఊరటనిచ్చే నిర్ణయం.

ఇతర ముఖ్యమైన నిర్ణయాలు

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు.

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు.

న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు.

భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైత, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

రైలు ఢీకొని నలుగురు విద్యార్థుల దుర్మరణం

శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఘోర రైలు ప్రమాదం

టెక్కలి సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):

శ్రీకాకుళం జిల్లాలో శనివారం అత్యంత విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. టెక్కలి సమీపంలో రైలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదంతో స్థానికంగా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు టెక్కలి మండలం రావివలస వద్ద రైలు పట్టాల సమీపంలో వర్షపు నీరు భారీగా వచ్చి చేరింది. ఈ నీటిలో చేపలు పట్టేందుకు ఐదుగురు విద్యార్థులు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వారు పట్టాలు దాటుతుండగా, అదే సమయంలో భువనేశ్వర్ నుంచి గుణుపూర్ వెళుతున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది.కురుస్తున్న భారీ వర్షం, వీస్తున్న బలమైన ఈదురు గాలుల కారణంగా వెనుక నుంచి వస్తున్న రైలు శబ్దాన్ని విద్యార్థులు గమనించలేకపోయారు. ఈ ప్రమాదంలో విశాఖ రావు, దిలీప్, శరత్, శివ అనే నలుగురు విద్యార్థులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సాల్మన్ రాజు అనే మరో విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా, అతడిని చికిత్స నిమిత్తం వెంటనే టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మృతులంతా టెక్కలి మండలం డమరు గ్రామానికి చెందిన వారని, టెక్కలిలోని ప్రభుత్వ ఎస్సీ/ఎస్టీ వసతి గృహంలో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నారని అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు యువకులు మృతి చెందడంతో బాధితుల కుటుంబాల్లోను, గ్రామంలోనూ రోదనలు మిన్నంటాయి.

జూరాలకు నీటి విడుదలకు ఓకే

మొదటిపేజీ తరువాయి

రైతులకు భారీ ఊరట లభించినట్లయింది.

ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు.తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాయుగుండం ముప్పు

మొదటిపేజీ తరువాయి

ఈ పరిణామంతో కోస్తా ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

ప్రస్తుతం ఈ వాయుగుండం గత ఆరు గంటలుగా గంటకు 5 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా కదులుతోంది. ఇది కళింగపట్నానికి ఆగ్నేయంగా 50 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి 120 కిలోమీటర్ల దూరంలో, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 150 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. పూరీకి ఇది 250 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వాయుగుండం పశ్చిమ-వాయవ్య దిశగా ప్రయాణించి, ఈ రోజు రాత్రి 8:30 నుంచి 11:30 గంటల మధ్య విశాఖపట్నం – గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుంది. ముఖ్యంగా కళింగపట్నానికి అత్యంత సమీపంలో ఇది భూభాగాన్ని తాకుతుందని అధికారులు స్పష్టం చేశారు. తీరం దాటే సమయంలో కూడా ఇది తీవ్ర వాయుగుండంగానే కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాలోని తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బలమైన ఈదురు గాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని హెచ్చరించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని, తీర ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా సిద్ధం చేశారు.

తెలంగాణ ఉద్యోగులకు రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది.రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

డీఎస్సీ మెగా స్కామ్..సీబీఐ విచారణ జరిపించండి

మొదటిపేజీ తరువాయి

జరిగిందో ఆధారాలతో సహా గవర్నర్ కు వివరించినట్లు తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ, అదే సమయంలో, అదే ప్రదేశంలో టీడీపీ గూండాలు ధర్నా నిర్వహించారని ఆరోపించారు. గతంలో 'సాక్షి' కార్యాలయాలపై దాడి చేసిన వారే ఈ దాడిలో పాల్గొని, నిరుద్యోగ యువత, వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బాధితులపైనే ప్రభుత్వం తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయడం దారుణమని ఆయన విమర్శించారు.ఈ రెండు ఘటనలతో పాటు డీఎస్సీ పరీక్షల నిర్వహణ నుంచి అభ్యర్థుల నియామకాల వరకు జరిగిన అక్రమాల తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జగన్ వివరించారు. ఎస్సీసీఈఆర్‌టీకి నేతృత్వం వహిస్తున్న ఒకే వ్యక్తికి ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం ఇవ్వలేదని, ఇది ప్రశ్నపత్రం లీక్ అయిందనడానికి నిదర్శనమని వైసీపీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవోలు జారీ చేసి, నియామకాలు పూర్తయ్యాక వాటిని రద్దు చేశారని, ఇది అక్రమాలకు బలమైన ఆధారమని జగన్ అన్నారు. కొందరు అభ్యర్థులు కనీసం టెట్ పరీక్ష కూడా రాయకుండానే ఉద్యోగాలు పొందారని, ఈ విధంగా 372 మందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. టీడీపీ నేతల ఆధ్వర్యంలోని సాఫ్ట్‌బాల్, జూడో సంఘాలు జారీ చేసిన నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో కొందరు ఉద్యోగాలు సంపాదించారని, ఈ విషయంలో శాప్, సంబంధిత సంఘాల మధ్య పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని తెలిపారు.ఉద్యోగాల అమ్మకాలకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని జగన్ విమర్శించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అన్ని ఆధారాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నందున, మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని జగన్ గుర్తుచేశారు. ఈ అక్రమాలపై న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఈసీల నియామకంపై సుప్రీం భిన్న తీర్పు

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ అభ్యర్థనపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీంతో కేసును తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ముందుంచాలని ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి వచ్చారు.2023లో పార్లమెంట్ ఆమోదించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలో సీఈసీ, ఈసీల నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రిని చేర్చారు. ప్రస్తుతం ఈ కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసి

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రభుత్వ సేవలపై ఆరా -ఈ-పంట నమోదును వేగవంతం చేయాలని ఆదేశం

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

శ్రీ సత్యసాయి/బుక్కపట్నం,సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):
ప్రభుత్వ సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా .. సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉన్నారా ..అనే అంశాలపై శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా బుక్కపట్నం మండలం సిద్ధాపురం గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ క్లినిక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను వరుసగా పరిశీలించారు.



ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సేవలు అందించాలి
తొలుత గ్రామ సచివాలయంలో ప్రభుత్వ సేవల అమలు, ప్రజల నుంచి అందుతున్న పిటిషన్లు, వాటి పరిష్కార స్థితిగతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అనంతరం సిద్ధాపురం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రైతులకు అందుతున్న విత్తనాలు, ఎరువుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్స్ కొరత లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా ఈ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన రైతులందరి వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోషకాహార లోపం తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
విలేజ్ క్లినిక్‌ను తనిఖీ చేసిన ఆయన అందుబాటులో ఉన్న వైద్య సేవలు, ఉచిత మందుల నిల్వలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన ఆరోగ్య సలహాలు అందించడంతోపాటు ల్యాబ్ పరీక్షల సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.జెడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థుల చదువు, పాఠశాలలో అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. నాడునేడు పనుల పురోగతి, విద్యా కానుక పంపిణీ, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల హాజరు, ఆరోగ్య పరిస్థితులు, వారికి అందుతున్న పౌష్టికాహారం వివరాలను తెలుసుకున్నారు. పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పౌష్టికాహార పంపిణీలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు.తనిఖీల అనంతరం గ్రామ సచివాలయం ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు. ప్రభుత్వ పథకాలు, ప్రజా సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రజలకు చేరేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందాల్సిన సేవల్లో నిర్లక్ష్యం కనిపిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు.

అక్రమ రవాణాపై కొరడా

ముగ్గురు అటవీ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు


బ్రహ్మయ్య


శ్రీరాములు


నరసింహమూర్తి

కదిరి క్రైమ్, సెప్టెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):
కదిరి అటవీ రేంజ్ పరిధిలో కొంతకాలంగా అక్రమార్కులు సంద్ర,కలప చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారు.విధులు నిర్వహించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. కొంతమంది అక్రమార్కుల కు సహకారం అందించడంతో ఈ విషయం ఉన్నతాధికారులకు చేరింది. దీంతో అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి అటవీశాఖలో ఒక్కసారిగా కలకలం రేగింది. సంద్ర చెట్ల అక్రమ నరికివేత, కలప రవాణాలో అక్రమార్కులతో చేతులు కలిపిన ముగ్గురు అటవీ ఉద్యోగులపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన సిబ్బందే ఉదాసీనంగా వ్యవహరించడంతో శాఖపరమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు.

అక్రమ కలప రవాణాకు నకిలీ అనుమతులు జారీ
జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అటవీశాఖ అధికారులు కదిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం తలుపుల మండలం కుర్లి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బ్రహ్మయ్య, పెద్దన్నవారిపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఎదురుదోన ఫారెస్ట్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శ్రీరాములుపై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు అటవీశాఖ వర్గాలు తెలిపాయి.దీంతో అడవులను కాపాడాల్సిన సిబ్బంది అక్రమ రవాణాను అడ్డుకోకపోవడం,పైగా అక్రమార్కులకు సహకరిస్తున్నారనే విషయాలు అధికారుల దృష్టికి వెళ్లాయి. దీంతో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు.అక్రమ కలప రవాణాకు సంబంధించి నకిలీ సంతకాలతో అనుమతులు జారీ చేసినట్లు విచారణలో గుర్తించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అక్రమార్కుల పట్ల ఉదాసీన వైఖరిపై ప్రాథమిక విచారణలో వచ్చిన అంశాల ఆధారంగా ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. ఒకేసారి ముగ్గురు ఉద్యోగులపై వేటు పడటం కదిరి అటవీశాఖలో చర్చనీయాంశంగా మారింది.

జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ



గుత్తి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్) పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలను డీఈవో అయూబ్ హుస్సేన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పాఠ్యాంశాల బోధన తీరును అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్లి పాఠశాలలో బోధిస్తున్న పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉపాధ్యాయులు బోధించే అంశాలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. తరగతిలో సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కూడా డీఈవో పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతున్నదా? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై కూడా ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవి నాయక్, మనోహర్, హెచ్ఎం సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాముడూరు అభివృద్ధికి మరో అడుగు

చెరువుకట్ట శుభ్రతకు రూ.2 లక్షల నిధులు



గుత్తి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)
గుత్తి మాముడూరు గ్రామంలోని చెరువుకట్టపై చెట్లు, పిచ్చిమొక్కలు, పొదలు విపరీతంగా పెరగడంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి చెరువుకట్ట శుభ్రత పనులకు రూ.2 లక్షల నిధులు మంజూరు చేయించారు.దీంతో బుధవారం చెరువుకట్ట శుభ్రపరిచే పనులను ప్రారంభించారు. ఆయకట్టు చైర్మన్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. చెరువుకట్టపై పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలు, పొదలను తొలగిస్తూ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. దీంతో చెరువుకట్ట పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా మారనున్నాయని గ్రామస్థులు తెలిపారు.గ్రామంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని గ్రామ నాయకులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల నిరసనకు బీఎస్పీ సంఘీభావం



గుత్తి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వీఆర్ఏలు చేపడుతున్న నిరసనకు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు బుధవారం సంఘీభావం తెలిపారు. గుత్తి రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న వీఆర్ఏలను బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్ కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విజయ్ రామాంజనేయులు మాట్లాడుతూ.. వీఆర్ఏలు చాలాకాలంగా ప్రభుత్వానికి తమ సమస్యలను విన్నవిస్తున్నప్పటికీ పరిష్కారం లభించకపోవడంతో నిరసనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి న్యాయమైన డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన చేస్తున్న ఉద్యోగులపై ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా వారి సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలని సూచించారు. వీఆర్ఏల పోరాటానికి బీఎస్పీ తరఫున అండగా ఉంటామని విజయ్ తెలిపారు.

కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

రైతులు, గ్రామీణ ప్రజలను ఆదుకోవాలి.. సీపీఐ, సీపీఎం, రైతు కూలీ సంఘాల సామూహిక దీక్ష

గుత్తి, సెప్టెంబరు 23: (రిపబ్లిక్ న్యూస్)
అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రాంత ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సీపీఐ, సీపీఎం, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సామూహిక దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. సెప్టెంబరు 21 నుంచి 23 వరకు నిర్వహించిన దీక్షల్లో కరువు పరిస్థితుల కారణంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు కోరారు.
కరువు ప్రభావంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేక కూలీలు ఉపాధి కోల్పోతున్నారని నాయకులు తెలిపారు. పశువులకు మేత, ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు



చేపట్టాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రధాన డిమాండ్లు
పశువుల కోసం వెంటనే పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి.రైతుల అన్ని రకాల బ్యాంకు రుణాలను రద్దు చేయాలి.
గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా కల్పించాలి రైతులు, వ్యవసాయ కూలీలకు కరువు పింఛన్లు అందించాలి. పంట నష్టపరిహారం అందించడంతో పాటు పంట బీమా అమలు చేయాలి.అవసరమైన ప్రతి గ్రామంలో ప్రజలకు ఉచితంగా తాగునీరు అందించాలి.గుత్తి మండలంలోని అన్ని చెరువులకు నీటిని అందించాలి.కరువు ప్రాంతాల విద్యార్థులకు ఫీజులు రద్దు చేయాలి.
కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణకు నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరాముడు, సీపీఎం నాయకుడు మల్లికార్జున, మహిళా సమైక్య నియోజకవర్గ కార్యదర్శి మహమ్మదా, అఖిల భారత రైతు సంఘం నాయకులు రామాంజనేయులు, ధనుంజయ, నజీర్, బెస్త శివకుమార్, సీనియర్ నాయకుడు టీఎం భాష తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలకు నిలువెత్తు నిదర్శనం ఎంపీపీ, ఎంపీటీసీలు

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి -ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, ఎంపీటీసీలకు ఘన సన్మానం





బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):- ప్రస్తుతం ఐదేళ్ల పదవీ కాలం దిగ్విజయంగా పూర్తి చేసుకొని పదవీ విరమణ చేస్తున్న బండి ఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, ఇతర ఎంపీటీసీలు అందరూ నమ్మకానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం పూర్తి కావడంతో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీపీ, ఎంపీటీసీల సేవలను కొనియాడుతూ వారిపై ప్రశంసల వర్షం కురిపించారు. తాను నాటి వైసిపి ప్రభుత్వంలో వారిపై ఎంతో నమ్మకంతో ఈ పదవి బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. అయితే ఆతర్వాత కొద్ది రోజులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఎంపీపీ, ఎంపీటీసీలు వారి రాజకీయ స్వార్థంతో కానీ, అధికార పార్టీ ప్రలోభాలకు గురికాకుండా, ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తన వెంటే ఉండి అంతే బాధ్యతతో ఎంపీపీ, ఎంపీటీసీలు తమ ఐదు సంవత్సరాల పదవీకాలంలో ఎలాంటి అవినీతి ఆరోపణలు, లేకుండా ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని ఆయన కొనియాడారు. ఇలాంటి నాయకులు, కార్యకర్తలు తన నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని చక్రపాణి రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన తన సోదరుడు శ్రీశైలం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బారెడ్డి భాస్కర్ రెడ్డి, దేషూ వెంకటరామిరెడ్డి, రాజంరెడ్డి సుజాతమ్మ, ఇతర వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డితో పాటు ఎంపీటీసీలు ,కోఆప్షన్ సభ్యులకు పూలమాలలు వేసి శాలవలతో ఘనంగా సన్మానించారు. ఆతర్వాత వారి అభిమానులు బంధువులు వైసిపి శ్రేణులు వారికి పూలమాలలు సెలవులు వేసి ఘనంగా సన్మానించడం జరిగింది.

ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి నమస్కరిస్తున్న
-ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి
తన ఎంపీపీ ఐదేళ్ల పదవీకాలంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా శిరస్సు వంచి నమస్కరిస్తున్నా అని ఎంపీపీ అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో శిల్పా చక్రపాణి రెడ్డి ఇంతటి గొప్ప అవకాశాన్ని తనకు కల్పించడం జరిగిందన్నారు. తాను కూడా అంతే నమ్మకంతో ఆయన నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా, చిన్న మచ్చ కూడా లేకుండా పనిచేశానన్నారు. ముఖ్యంగా తన ఐదు సంవత్సరాల పదవీకాలంలో సహచర ఎంపీటీసీలు, అధికార యంత్రాంగం, మండల ప్రజలు, చివరకు పత్రికా విలేఖరులు కూడ వారి సంపూర్ణ సహకారం అందించడంతో తాను తన పదవీ బాధ్యతలను దిగ్విజయంగా పూర్తి చేసుకోగలిగానని ఎంపీపీ సంతోషం వ్యక్తం చేశారు. వారందరికీ మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్న అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సన్మాన సభ కార్యక్రమంలో ఎంపీడీవో,మండల పరిషత్ అధికారులు, వివిధ శాఖల మండల అధికారులు ఆయనతో పాటు ఎంపీటీసీలను శాలువలతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ర్యాలీ

నిరసన చేసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ

పాములపాడు సెప్టెంబర్-23 రిపబ్లిక్ న్యూస్:- మండల కేంద్రమైన పాములపాడులోని, తహసిల్దార్ కార్యాలయం ముందు వీఆర్ఏల అధ్యక్షులు సద్దల పరమేశ్వరుడు, కార్యదర్శి కె.నారాయణ, కోశాధికారి డి.మౌలాలి, ఉపాధ్యక్షులు ఆర్.చంద్రశేఖర్ నాయక్, కమిటి సభ్యులు సంగెం.చంద్రుడు, షేక్.మాబు సాహెబ్, బషీర్ అహమ్మద్, పూల రంగడు, ఎల్.వెంకటయ్య, తదితర వీఆర్ఏలు కలిసి గత వారం రోజులుగా సహాయ నిరాకరణ దీక్షలు చేపట్టి, ఈరోజు మా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి బస్టాండ్ సెంటర్లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపి, ఆయనకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వీఆర్ఏ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్ఏ)ల సంఘాల జేఏసీ కమిటి పిలుపుమేరకు ఈ నెల-16 వ తేదీ నుండి అన్ని జిల్లాల యందు, అన్ని మండలాలలో సహాయ నిరాకరణ దీక్షలు చేపడుతున్నామన్నారు. గత ఎనిమిది సంవత్సరాలు దాటిన కూడా మా జీతం 10,500/- రూపాయలు ఉండడం వలన ఇప్పుడు నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటి అవి ఏమిటికి సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా వీఆర్ఏల



కుటుంబాలు జీవనం చాలా దుర్భర పరిస్థితిగా మారిందనీ అన్నారు. గ్రామంతో సర్వే చేయాలన్న ప్రతి ఆఫీసర్ కు సహాయకులముగా, ఏ ప్రమాదాలు జరిగిన వీఆర్ఏలు కావాలనీ అన్నారు. కావున వీఆర్ఏల బ్రతులు బాగుండాలి అంటే కనీస వేతనం 26,000 చు రూపాయిలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు తెలియజేసుకుంటున్నామనీ అన్నారు. మా డిమాండ్లు పే స్కేలు అమలు చేయాలని కనీస వేతనం 26,000 రూపాయిలు ఇవ్వాలని, నామినీలుగా పని చేస్తున్న వారసులను వీఆర్ఏ లుగా నియమించాలనీ, అర్హులైన వారికి వీఆర్వో, అటెండర్, హెచ్‌మేన్ పోస్టులు ఇవ్వాలని కోరుతూ బస్టాండ్లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించడం జరిగింది.

వీఆర్ఏల నిరసన కార్యక్రమానికి వికలాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శీలం శ్రీనివాస్, మాల మహానాడు నాయకుడు నల్లమల అబ్రహం, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కోట ప్రభాకర్, శ్రీనివాసులు తమ మద్దతును తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పాములపాడు మండలంలోని గ్రామరెవెన్యు సహాయకుల సంఘం నాయకులు యోగేశ్వరరావు, అహమ్మద్ హుస్సేన్, లక్ష్మీదేవి, ఆరిఫా, మౌలాలి, నారాయణ నాయక్, జన్ను సాహెబ్, నాగన్న, మధుబాబు, పుల్లయ్య, సుబ్బరాయుడు, నాగరత్నం, చంద్రశేఖర్ నాయక్, వెంకటరమణ, పి.లక్ష్మి, వెంకటయ్య, శివశంకర్, వెంకటేశ్వర్లు, లక్ష్మీ నాయుడు, మల్లయ్య, నాగన్న, షంషీర్ భాష, పెద్ద ఈశ్వరయ్య స్వామి, పెద్ద లింగస్వామి, గోవర్ధన్, లావణ్య, పుల్లమ్మ, మూర్తుజా, లింగస్వామి, స్వామినాథం, ఎన్.బాషా, శ్రీరాములు, తదితరులు పాల్గొనడం జరిగింది.

మిట్టకందాల గ్రామంలో ఉచిత ఆయుష్ వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు

:-డాక్టర్ డి.సావిత్రి(పాములపాడు ఆయుర్వేద వైద్యశాల)





పాములపాడు సెప్టెంబర్-23 రిపబ్లిక్ న్యూస్:-పాములపాడు మండలంలోని, మిట్టకందాల గ్రామంలో ఈరోజు 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా పాములపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ డి. సావిత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆయుష్ ఆరోగ్య వైద్య శిబిరము నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ డి.సావిత్రి మాట్లాడుతూ ఆయుర్వేదానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఈ మందులు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ చూపించమన్నారు. పూర్వం ఆదిమానవుడు, ఋషులు, రాజుల కాలం నుండి ఆయుర్వేద మందులు వాడి నయం చేసుకుంటున్నారన్నారు. ఇది ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం అని అన్నారు. ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలి మరియు మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు వాళ్లు కూడా ఆరోగ్యంగా జీవించాలంటే, ఎటువంటి రోగాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఆయుర్వేద మందులను వాడాలని సూచించారు. ఈ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం "వన్ హెల్త్ వన్ ఫ్యూచర్" అంటే ప్రతి ఒక్క మనిషి ఆరోగ్యకరంగా ఉంటూ జీవించాలని దీని అర్థం. అలాగే మన భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈరోజు మిట్టకందాల గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్స్ సిబ్బంది ఎం.రవి, టిడిపి మండల కల్చరల్ అధ్యక్షులు భావన వినోద్ కుమార్, మిట్టకందాల గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

కరువుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన వైసీపీ రైతు విభాగం నాయకులు




గుత్తి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)

అనంతపురం జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ విభాగం కార్యదర్శి మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గుత్తి, పామిడి మండలాల్లో వారు పర్యటించి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంటల పరిస్థితి, సాగు ఖర్చులు, నష్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుత్తిలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయాయని తెలిపారు. ముఖ్యంగా వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు.పంటలు చేతికందక రైతులు పెట్టుబడులు కోల్పోయారని, కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు పంట నష్టపరిహారంతో పాటు పంట బీమా పరిహారం అందేలా చూడాలని కోరారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, కోదండ రమేష్‌రెడ్డి, సీవీ రంగారెడ్డి, డిష్ అన్వర్, వాల్మీకి శివ తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజారోగ్య పరిశీలన బృందం తనిఖీ

వ్యాధుల నిఘా వ్యవస్థలు, ప్రజారోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలన





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 23)

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రజారోగ్య పరిశీలన బృందం తనిఖీ నిర్వహించింది. రాష్ట్ర ప్రజారోగ్య పరిశీలన బృందం సలహాదారు డాక్టర్ శృతి ఆసుపత్రిని సందర్శించి ప్రజారోగ్య కార్యక్రమాల అమలు, వ్యాధుల నిఘా వ్యవస్థలు, ఆసుపత్రి స్థాయి సన్నద్ధతకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలోని కుక్కకాటు బాధితుల చికిత్స విభాగాన్ని సందర్శించిన డాక్టర్ శృతి, అక్కడ అందుతున్న వైద్య సేవలు, చికిత్సా విధానం, సంబంధిత రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని ఇతర విభాగాలను కూడా సందర్శించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.


ప్రజారోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు వ్యాధుల నిఘా వ్యవస్థలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరంపై అధికారులకు పలు సూచనలు చేశారు. వ్యాధుల గుర్తింపు, సమాచారం సేకరణ, పర్యవేక్షణ, నియంత్రణ చర్యల్లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా వ్యాధుల నిఘా అధికారి విశ్వేశ్వర్ రెడ్డి, అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ వేణుగోపాల్, సహాయ ఆచార్యురాలు డాక్టర్ బ్లెస్సి, ఆసుపత్రి పరిపాలనా వైద్య అధికారి డాక్టర్ సునీల్ ప్రశాంత్‌తో పాటు ప్రజారోగ్య పరిశీలన బృందం సభ్యులు, ఆసుపత్రి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

మాలపల్లి, రచ్చుమర్రిలో బీజేపీ జెండా ఆవిష్కరణ

'మన ఊరు--మన జెండా' కార్యక్రమం- ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి





ఎమ్మిగనూరు , సెప్టెంబర్, 23.(ప్రజారిపబ్లిక్ న్యూస్):మంత్రాలయం మండలంలోని మాలపల్లి, రచ్చుమర్రి గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు--మన జెండా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి రెండు గ్రామాల్లో బీజేపీ జెండాలను ఆవిష్కరించారు.గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు బీజేపీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు జెండాలతో నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, సత్యసాయి జిల్లా బీజేపీ ఇన్‌చార్జి కూనిగిరి నీలకంఠ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళినాయుడు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయుడు, మంత్రాలయం ఇన్‌చార్జి విష్ణువర్ధన్, మండల అధ్యక్షుడు కృష్ణ, ఓబీసీ మోర్చా రాయలసీమ ఇన్‌చార్జి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధలతో లడ్డూ వేలం

రాయికల్, సెప్టెంబర్ 23
(రిపబ్లిక్ న్యూస్)



రాయికల్ పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వితీయ సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడి లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించగా సంఘ సభ్యుడు మొగిలిపాక మహేశ్ గౌడ్ రూ.4,516లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. మహిళలు, సంఘ సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం..

'ఆపరేషన్ త్రిశూల్'కు శ్రీకారం

మహిళా భద్రత, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన

గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 23)

కర్నూలు జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్‌కార్డ్ (ఎన్‌సీఓఆర్‌డీ) సమావేశంలో జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. అనంతరం మహిళా భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రత అనే మూడు ప్రధాన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే 'ఆపరేషన్ త్రిశూల్' పోస్టర్‌ను కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో తహశీల్దార్లు, పోలీసు, ఎక్సైజ్ అధికారులు కలిసి 'వజ్ర ప్రహార్' సోదాలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి సాగు లేదా మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఆలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మిరప తోటలో సుమారు 10 గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు అధికారులు వివరించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 300 డ్రగ్స్ టెస్టింగ్ కిట్లలో ఇప్పటివరకు 114 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం గుర్తించిన వారిని అవసరాన్ని బట్టి కర్నూలు, విశాఖపట్నం, కోయంబత్తూరు డి-అడిక్షన్ కేంద్రాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

డి-అడిక్షన్ కేంద్రంలో సిబ్బంది కొరతను పరిష్కరించేందుకు నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాధితులకు నిరంతర పర్యవేక్షణ, కౌన్సెలింగ్, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు సంబంధిత అధికారులకు లేదా 1972 హెల్ప్‌లైన్‌కు తెలియజేసి డ్రగ్స్ నియంత్రణలో భాగస్వాములు కావాలని కోరారు.



మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా మహిళా భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రతపై జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళలపై నేరాల నివారణతో పాటు గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.మహిళా భద్రతపై ప్రత్యేకంగా ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్వాక్రా, మెప్మా, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలు, మహిళా పోలీసులు, ప్రధానోపాధ్యాయులు తదితరులను భాగస్వామ్యం చేసి గ్రామస్థాయి వరకు కార్యక్రమాలను విస్తరించాలని ఆదేశించారు.డ్వాక్రా, మెప్మా మహిళా సంఘాల సమావేశాలు, గ్రామస్థాయి సమావేశాల ద్వారా మహిళలకు భద్రతా చర్యలు, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలపై అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే 15 రోజుల్లో లేదా వచ్చే నెలలో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఈగల్ టీమ్ కార్యక్రమాలపై సమీక్ష

మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా ఇప్పటివరకు ఐదు పల్లెబాట కార్యక్రమాలు, 13 డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. లీప్ యాప్ ద్వారా అందిన రెండు ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సంబంధిత పోలీసు అధికారులను పంపించి సమస్యలను పరిష్కరించినట్లు వెల్లడించారు.1972 హెల్ప్‌లైన్‌కు వచ్చిన రెండు ఫిర్యాదుల్లో ఒక కేసులో కౌన్సెలింగ్ అందించగా, మరో కేసులో గంజాయికి బానిసైన వ్యక్తిని డి-అడిక్షన్ కేంద్రంలో చేర్పించి చికిత్స అందించినట్లు తెలిపారు.

ప్రజల్లో మాదకద్రవ్యాలపై అవగాహన పెంచేందుకు 'ఈగల్ ఏపీ 1972 కర్నూలు' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీని ప్రారంభించినట్లు అధికారులు వివరించారు. డ్రగ్స్ వ్యతిరేక





కార్యక్రమాలకు సంబంధించిన 30 సెకన్ల వీడియోలు, రీల్స్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణ, మహిళా భద్రత, రోడ్డు భద్రతలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచి, అందిన సమాచారంపై సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శాంతి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, డీఈఓ సుధాకర్, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన్న, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు, డీసీఆర్‌బీ ఎన్‌డీపీఎస్ నోడల్ అధికారి సీఐ గుణశేఖర్ బాబు, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మస్తాన్ వలి, డీటీఆర్‌బీ సీఐ ఆదిలక్ష్మి, ఈగల్ టీమ్ ఆర్ఎస్ఐ రమేష్ బాబు, ఈగల్ టీమ్ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న జడ్పిటిసి ఎంపిటిసి లకు ఘన సన్మానం









రైల్వే కోడూరు సెప్టెంబర్ 23 రిపబ్లిక్ న్యూస్.

మండల కేంద్రం రైల్వే కోడూరు లోని మండల అభివృద్ధి అధికారి సభ భవన కార్యాలయంలో ఎంపీటీసీ జడ్పిటిసి లో తమ ఐదేళ్ల పదవీ కాలాన్ని ఐక్యమత్యంతో విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు గాను మండల ఎంపీపీ సింగమల భవాని, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి లో ఎంపీటీసీ జడ్పిటిసి లకు శాలువల కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించడం జరిగినది, ఈ కార్యక్రమం మండల ఎంపీపీ సింగమల భవాని అధ్యక్షతన జరగడం విశేషం అనంతరం వైస్ ఎంపీపీ ధ్వజ రెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరు మండలంలోని అందరు ఎంపీటీసీలు జడ్పిటిసిలు ఎంతో వైకమత్యంతో తమ ఐదేళ్ల పదవీ కాలాన్ని ప్రజాక్షేత్రంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహించి గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశారు, అంతేకాకుండా మండలంలో ఇంకా ఎన్నో సమస్యలు పెండింగ్లో ఉన్నాయని ఎన్నో పనులు నిర్మాణ దశలో జరుగుతున్నాయని వీటన్నింటి విషయంలో సభ్యులు పదవీకాలం పూర్తయినదని అనుకోకుండా ప్రతిక్షణం ప్రజాక్షేత్రంలో ప్రజాభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ వాటికోసం అభివృద్ధి కోసం పాటుపడుతూ ఉండాలని అధ్యక్ష ఉపాధ్యక్షులు కోరారు,ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని సన్మానించుకోవడం చాలా ఆనందంగా ఉన్నదని, తమ పదవీకాలం పూర్తయిన అందరమూ ప్రజాక్షేత్రములు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ ద్వారా ప్రజలకు అవసరమైన కార్యక్రమాలను అభివృద్ధి పనులను దగ్గరుండి చేయించాలని ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఎంపీటీసీలకు జడ్పిటిసి లకు అంతేకాకుండా మాజీ సర్పంచ్లకు పిలుపునిచ్చారు, మండల ఎంపీపీ సింగమల భవాని, మండల వైస్ ఎంపీపీ రాష్ట్ర వైఎస్ఆర్సిపి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, ధ్వజారెడ్డి సభ్యులతో కలిసి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, పలు ప్రజోపకర కార్యక్రమాలను సభ్యులతో నెమరు వేసుకున్నారు, సభ్యులందరూ ముక్తకంఠంతో అధ్యక్ష ఉపాధ్యక్షులకు ధన్యవాదములు, కృతజ్ఞతలు తెలియజేశారు అంతకుముందు అధ్యక్ష,ఉపాధ్యక్షులను, సభ్యులందరూ శాలువా కప్పి పూలదండ వేసి ఘనంగా వారిని సత్కరించడం జరిగినది, ఈ కార్యక్రమంలో





మండల అభివృద్ధి అధికారిని హరితమ్మ,పలువురు అధికారులు,మాజీ సర్పంచ్లు,వార్డు మెంబర్లు,వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,ధ్వజారెడ్డి అభిమానులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నందలూరు తాసిల్దార్ తో దళిత భూ సమస్యలపై చర్చించిన దళిత నాయకులు.



రైల్వే కోడూరు సెప్టెంబర్ 23 రిపబ్లిక్ న్యూస్.

మండల కేంద్రం నందలూరు మండల పరిధిలోని పలు దళిత గ్రామాలలోని దళితుల భూ సమస్యల పై బుధవారం నందలూరు తాసిల్దార్ తో శ్రీచర్చించినట్లు రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల గాజుల శ్రీనివాసులు తెలిపారు, అనంతరం వారు ఇరువురు పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఎస్ సి, ఎస్ టి,పేద దళితులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించాలని నిరుపేదలకు డికెటి భూములు పంపిణీ చేయాలని ఇల్లు లేని వారికి ఇంటి పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని తాసిల్దార్ సుజాత నీ కోరినట్లు తెలిపారు అలాగే బీసీ మైనారిటీ భూమిలేని పేదలకు ఇంటి స్థలాలు పక్కా గృహాలు మంజూరు చేయించి కట్టుకునేందుకు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు అనంతరం మండల తహసిల్దార్ సుజాత స్పందిస్తూ న్యాయమైన మీ అభ్యర్థనను ఉన్నతాధికారులతో చర్చించి తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు, ముత్యాల గాజుల శీనువాసులు కల్పించుకొని దళితుల సమస్యలు మీ దృష్టికి వచ్చితే దయచేసి సత్వర పరిష్కారం చూపాలని ఎమ్మార్వో అని కోరారు,ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ చోడవరం శ్రీరాములు పలు అధికారులు పాల్గొన్నట్లు వారు తెలిపారు.

బస్టాండ్‌లో బాలుడి అనుమానాస్పద మృతి

విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు అనుమానం ఘటనపై పోలీసుల దర్యాప్తు





అవుకు సెప్టెంబర్ 23(రిపబ్లిక్ న్యూస్)

నంద్యాల జిల్లా అవుకు పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో 14 ఏళ్ల బాలుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. విద్యుత్ షాక్ తగలడంతోనే బాలుడు మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నప్పటికీ, ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన నిఖిల్ (14) అవుకు పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి నిఖిల్‌తో పాటు మరో ముగ్గురు విద్యార్థులు హాస్టల్ నుంచి బయటకు వచ్చి బస్టాండ్ ఆవరణలోని ఓ దుకాణానికి వెళ్లినట్లు సమాచారం. అక్కడి నుంచి బయటకు వస్తున్న సమయంలో సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయినట్లు స్థానికులు తెలిపారు.ఘటనను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిన అనంతరం బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.విషయం తెలుసుకున్న బాలుడి తల్లిదండ్రులు, బంధువులు అవుకు చేరుకున్నారు. పాఠశాల, హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని వారు ఆరోపించారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాల వద్ద విద్యార్థుల బంధువులు ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.సమాచారం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని నిఖిల్ తల్లిదండ్రులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని ఆయన కోరారు. పోలీసుల తీరుపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థి మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

నందలూరు తాసిల్దార్ తో దళిత భూ సమస్యలపై చర్చించిన దళిత నాయకులు.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 23 రిపబ్లిక్ న్యూస్.

మండల కేంద్రం నందలూరు మండల పరిధిలోని పలు దళిత గ్రామాలలోని దళితుల భూ సమస్యల పై బుధవారం నందలూరు తాసిల్దార్ తో శ్రీచర్చించినట్లు రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల గాజుల శ్రీనివాసులు తెలిపారు, అనంతరం వారు ఇరువురు పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఎస్ సి, ఎస్ టి,పేద దళితులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించాలని నిరుపేదలకు డికెటి భూములు పంపిణీ చేయాలని ఇల్లు లేని వారికి ఇంటి పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని తాసిల్దార్ సుజాత నీ కోరినట్లు తెలిపారు అలాగే బీసీ



మైనారిటీ భూమిలేని పేదలకు ఇంటి స్థలాలు పక్కా గృహాలు మంజూరు చేయించి కట్టుకునేందుకు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు అనంతరం మండల తహసిల్దార్ సుజాత స్పందిస్తూ న్యాయమైన మీ అభ్యర్థనను ఉన్నతాధికారులతో చర్చించి తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ చోడవరం శ్రీరాములు పలు అధికారులు పాల్గొన్నట్లు వారు తెలిపారు.

23/09/2026 వ. తేదీన కడప జిల్లా నందలూరు మండలం తాసిల్దార్ గారితో భూ సమస్యలపై చర్చిస్తున్న అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోలం రెడ్డి మల్లికార్జున రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల గాజుల శీను మాట్లాడుతూ మండలంలో ఎస్సీ ఎస్టీ బీసీ భూములపై ఎటువంటి సమస్యలు వచ్చిన తక్షణమే స్పందించి పరిష్కార మార్గం చూపాలని భూ అక్రమ దారులపై చర్యలు తీసుకొని బడుగు బలహీన వర్గాల వారికి న్యాయం చేయాలని తాసిల్దార్ గారిని కోరడమైనది

పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు.

ఎంపీడీవో, ఎం వి ఎన్ రాజేంద్ర.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 23 రిపబ్లిక్ న్యూస్.

మండల కేంద్రం ఓబులవారిపల్లి లోని మండల అభివృద్ధి అధికారి సభా భవన కార్యాలయం లో, మండలంలోని అన్ని పంచాయతీ కార్యదర్శులు, అన్ని పంచాయతీల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆయా పంచాయతీలలోని మౌలిక సదుపాయాలు పలు కార్యక్రమాల వినియోగము మరియు ఉపయోగకరమైన విషయాలపై బుధవారం అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమం మండల అభివృద్ధి అధికారి ఎంపీడీవో, ఎం వి ఎన్ రాజేంద్ర ఆధ్వర్యంలో ఆయన అధ్యక్షతన నిర్వహించారు, త్రాగునీరు పారిశుధ్యం లిక్విడ్ మేనేజ్మెంట్ తదితర విషయాలపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన మరియు శిక్షణ ఇవ్వడం జరిగినది,ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లోని వీధులలో వ్యర్థపదార్థాల

నిర్వహణ, చెత్త ఏరివేత, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించి తగు చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో కార్యదర్శులు అసిస్టెంట్ ఇంజనీర్లు జాగ్రత్త వహించాలని వారికి హెచ్చరిక చేశారు, త్రాగునీటి విషయంలో ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందించడంలో అధికారులు అత్యంత శ్రద్ధ వహించాలన్నారు, గ్రామాలలో వీధులను పరిశుభ్రంగా ఉంచడం వంటి విషయాలలో పంచాయతీల సిబ్బందికి అవగాహన కల్పించారు, అంతేకాకుండా గ్రామాలలో చెత్త ఎరివేసి శుభ్రంగా ఉంచడంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించవద్దని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు, గ్రామాల్లో పారిశుద్ధ్యం, తీసుకోవలసిన చర్యలు, మెరుగు పరచవలసిన విషయాలపై ప్రజలకు అవగాహన ఎలా కల్పించాలో వాటిపై కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎండిఓ రామ్మోహన్ రెడ్డి తెలియజేశారు, అందరూ సమన్వయంతో గ్రామాలలో పారిశుధ్యం మంచినీరు,వీధి దీపాలు విషయాలలో కలిసి దృష్టి సారించాలని మౌలిక సదుపాయాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకుండా అందరూ పని చేయాలని ఎండిఓ రాజేంద్ర,డిప్యూటీ ఎం డి ఓ



ఎంపీడీవో, ఎం వి ఎన్ రాజేంద్ర.

రామ్మోహన్ రెడ్డి సభా ముఖముగా తెలియజేశారు, ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు వస్తే, జిల్లా అధికారులకు తెలియపరచి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శివప్రసాద్,బాలసుబ్రమణ్యం, పలువురు పంచాయితీ కార్యదర్శులు, మహిళా కార్యదర్శిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నెమళ్ళకుంటలో ఉచిత వైద్య శిబిరం

బండి ఆత్మకూరు,సెప్టెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):-

బండి ఆత్మకూరు మండలం, నెమల్ల కుంట చెంచు గూడెంలో ఇండస్ గుండె హాస్పిటల్ నంద్యాల వారి ఆధ్వర్యంలో నేడు అనగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం ప్రకటించింది. గూడెంలో నివసిస్తున్న సుమారు 50 చెంచు కుటుంబాలకు వైద్య సేవలతో పాటు అవసరమైన సహాయం అందించేందుకు ఉచిత సేవా కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందనీ వారు బుధవారం వెల్లడించారు.ఇందులో భాగంగా చెంచు కుటుంబాలకుబీపీ,షుగర్, ఈసిజి పరీక్షలతో పాటు గుండె స్కానింగ్ వంటి పరీక్షలు చేయడం జరుగుతుందనీ తెలిపారు. అంతే కాకుండా రాబోయే చలికాలం దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన ఉల్లన్ దుప్పటి, దోమ తెర వంటి వస్తువులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని వారు విన్నవించారు.

పవిత్ర మూయే ముబారక్ దర్శనం

గ్యార్మీ పండుగ వేడుకల్లో పాల్గొన్న షకీల్ సఫీ -శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రత్యేక దువా







అనంతపురం సంక్షేమం, సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్): పవిత్ర గ్యార్మీ పండుగ సందర్భంగా అనంతపురం నగరంలోని చైతన్యనగర్‌లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. షాహే గౌసే ఆజం వద్ద నిర్వహిస్తున్న గ్యార్మీ పండుగ వేడుకల్లో భాగంగా గౌస్-ఎ-ఆజమ్ (ర.అ) వారి పవిత్ర “ మూయే ముబారక్ “ను రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షుడు, జామియా మసీదు ముతవల్లి అల్‌హాజ్ కే.ఎం. షకీల్ సఫీ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.పవిత్ర మూయే ముబారక్‌ను దర్శించుకున్న అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర సామరస్యం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక దువా చేశారు. గ్యార్మీ పండుగ ఆధ్యాత్మికత, భక్తి భావంతో సాగింది.ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ఎం.ఎం.డి. ఇమామ్, కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, కార్యదర్శి నవీద్ ఖాన్, ట్రెజరర్ అబ్దుల్ సమీ, మహబూబ్ బాషా, నిసార్ అహ్మద్, షౌఖాత్, పర్వేజ్ తదితరులు హాజరయ్యారు.స్థానిక మతపెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ సందర్భంగా భక్తుల రాకతో చైతన్యనగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సర్వమత సౌభ్రాతృత్వం, శాంతి, సామరస్యానికి ప్రతీకగా వేడుకలు కొనసాగాయి.

కూటమి ప్రభుత్వం పై వైసీపీ నాయకుల దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన జనసేన యువనేత మిథున్ షాలి....

రేణిగుంట సెప్టెంబర్ :23(రిపబ్లిక్ న్యూస్)

సనాతన ధర్మ పరిరక్షణ, భక్తుల విశ్వాసాల కాపాడటమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు, ఆ పార్టీ అనుకూల సోషల్ మీడియా విభాగాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని జనసేన యువ నేత మిథున్ షాలి తీవ్రంగా ఖండించారు. భక్తుల మనోభావాలకు సంబంధించిన సున్నితమైన అంశాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.పవిత్ర ప్రసాదం నాణ్యత, పవిత్రతపై అనుమానాలు వెలువడిన సమయంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి ఎంతో బాధ్యతాయుతంగా స్పందించారని గుర్తుచేశారు. సమాజంలో ధార్మిక పరిరక్షణపై అవగాహన



పెంచేలా 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష పూని తమ ఆధ్యాత్మిక నిబద్ధతను నిరూపించుకున్నారని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో చేసిన పొరపాట్లను కప్పిపుచ్చుకోవడానికే వైసీపీ ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత విమర్శలకు దిగుతూ ప్రజలను దారి మళ్లించే యత్నం చేస్తోందని ఆరోపించారు.ప్రస్తుతం స్వతంత్ర దర్యాప్తు సంస్థల విచారణ ద్వారా అసలు నిజాలు బయటకు వస్తున్నాయని, కల్తీకి కారణమైన ప్రమోటర్లపై చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభమయ్యాయని స్పష్టం చేశారు. బాధ్యులపై విచారణ కొనసాగుతున్న తరుణంలో, కోర్టు తీర్పులు వచ్చే వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి చవకబారు ఆరోపణలు చేయడం అపహాస్యాస్పదమన్నారు. భవిష్యత్తులో ఏ పుణ్యక్షేత్రంలోనూ ఇలాంటి సంఘటనలు జరగకుండా టీటీడీ సరఫరా వ్యవస్థలో నాణ్యత, పూర్తి పారదర్శకత తీసుకురావడమే తమ ప్రాధాన్యతని మిథున్ షాలి తేల్చి చెప్పారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పరిటాల కుటుంబంపై మాట్లాడితే ఊరుకోం

ప్రకాష్‌రెడ్డికి టిఎన్ఎస్ఎఫ్ బాండి పరశురాం హెచ్చరిక

అనంతపురం అర్బన్, సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):
పరిటాల కుటుంబంపై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్ హెచ్చరించారు. పరిటాల కుటుంబంపై “కారుకూతలు” కూస్తే తగిన రీతిలో సమాధానం చెబుతామని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాప్తాడు నియోజకవర్గంలో నారా లోకేశ్ పర్యటనతో టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపించిందని, నియోజకవర్గం పసుపుమయంగా మారిందని పేర్కొన్నారు. ఇటీవల రాప్తాడులో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలను నారా లోకేశ్ ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

పేదవాడికి అండగా నిలిచిన నందమూరి తారకరామారావు, పరిటాల రవీంద్ర వంటి నేతల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం ప్రజల అదృష్టమని పరశురామ్ అన్నారు. పరిటాల రవీంద్ర చరిత్రను ప్రకాష్‌రెడ్డి విమర్శించడం సరికాదన్నారు. గతంలో పరిటాల రవీంద్ర చరిత్రను విమర్శించిన ప్రకాష్‌రెడ్డి.. అదే చరిత్రకు భయపడి ప్రొద్దుటూరులో దాక్కున్నారంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి, సాగునీటి అంశాలపై కూడా పరశురామ్ ప్రకాష్‌రెడ్డిని టార్గెట్ చేశారు. పేరూరు డ్యాం పనులను



రద్దు చేసి రైతులకు అన్యాయం చేసింది ఆయనేనని ఆరోపించారు. పరిటాల సునీత నాయకత్వంలో పేరూరు డ్యాం పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు.
నియోజకవర్గంలోని చెరువులకు సాగునీరు అందిస్తున్నామని, గ్రామాల్లో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించాలని ప్రకాష్‌రెడ్డికి సూచించారు. “ పచ్చకామెర్ల కళ్లతో చూస్తే అంతా పచ్చగానే కనిపిస్తుంది “ అంటూ ఆయనపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.
రాబోయే స్థానిక ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని పరశురామ్ అన్నారు. 2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో రాప్తాడు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ప్రకాష్‌రెడ్డి సొంత గ్రామమైన తోపుదుర్తికి సైతం సునీత ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తారు రోడ్డు, సాగునీటి సౌకర్యాలు వచ్చాయని పరశురామ్ తెలిపారు.పరిటాల కుటుంబం గతంలో ప్రజల కోసం చేసిన సేవలను గుర్తు చేస్తూ.. రాప్తాడు నియోజకవర్గంలో మళ్లీ ఫ్యాక్షన్, గొడవలు, కక్షలకు తావులేకుండా అభివృద్ధి వైపు తీసుకెళ్లడమే పరిటాల సునీత లక్ష్యమని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ నియోజకవర్గంలో శాంతి, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు.పరిటాల కుటుంబంపై ఇకపై వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలు చేస్తే టీడీపీ శ్రేణులు తీవ్రంగా స్పందిస్తాయని పరశురామ్ హెచ్చరించారు. రాప్తాడు ప్రజలు అభివృద్ధిని గమనిస్తున్నారని, రాజకీయంగా ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.

జాతీయ స్థాయికి ఎస్‌కేయూ విద్యార్థులు





అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎన్ ఎస్ ఎస్ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్--2027కు సంబంధించిన ఎంపికలు బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. జాతీయ స్థాయిలో న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనేందుకు నిర్వహించిన ఈ ఎంపికల్లో 150 మంది ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. విద్యార్థుల శారీరక సామర్థ్యం, ప్రతిభ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పరిశీలించి వివిధ దశల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టారు.ఎంపికలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్ జ్యోతికుమార్ ప్రారంభించారు. ఎన్ ఎస్ ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలతో పాటు దేశభక్తి పెంపొందుతుందని అన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనే అవకాశం విద్యార్థులకు ఎంతో ప్రతిష్టాత్మకమైనదని పేర్కొన్నారు.
త్రికరణశుద్ధిగా జీవించినప్పుడే మానవ జీవితానికి సార్థకత: ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.ఆర్. సదాశివరెడ్డి మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో వాలంటీర్లుగా చేరడం అదృష్టమన్నారు. “ నా కోసం కాదు.. నీ కోసం “అనే ఎన్ ఎస్ ఎస్ నినాదం భారతీయ జ్ఞాన పరంపర సారాంశాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఇతరుల సంక్షేమాన్ని కోరుతూ త్రికరణశుద్ధిగా జీవించినప్పుడే మానవ జీవితానికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు.హైదరాబాద్‌కు చెందిన ఎన్ ఎస్ ఎస్ రీజినల్ డైరెక్టర్ శ్రీ సైదా నాయక్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ కొనసాగింది. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఎంపికలు చేపట్టారు. ఎంపికైన వాలంటీర్లు 2027 జనవరిలో న్యూఢిల్లీలో నిర్వహించే ఎన్ ఎస్ ఎస్ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో పాల్గొనే అవకాశం పొందనున్నారు.విశ్వవిద్యాలయ స్థాయి నుంచి జాతీయ స్థాయికి విద్యార్థులు ఎంపికయ్యే అవకాశం కల్పించడం ఎస్‌కేయూకు, అనంతపురానికి గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ఎన్ ఎస్ ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దశమి ఉత్సవాల్లో బీవీ స్మారక కబడ్డీ టోర్నమెంట్

పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి



ఎమ్మిగనూరు , సెప్టెంబర్ 23,(ప్రజారిపబ్లిక్ న్యూస్)శ్రీ శ్రీ శ్రీ ఆది చింతలముని నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించనున్న బీవీ స్మారక కబడ్డీ టోర్నమెంట్ పోస్టర్‌ను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. గోనెగండ్ల మండల కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడంతో పాటు సంప్రదాయ కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలు యువతలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, జట్టు స్ఫూర్తి, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.బీవీ టీమ్, ట్రాక్టర్ యూనియన్ల ఆధ్వర్యంలో అక్టోబర్ 1న గోనెగండ్ల జెడ్పీహెచ్ పాఠశాల మైదానంలో కబడ్డీ టోర్నమెంట్‌తో పాటు ఎద్దుల బండలగూడు పోటీలు, కళాకారులచే నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దశమి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాలు గ్రామీణ క్రీడలు, కళలు, సాంస్కృతిక సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, పీఏసీఎస్ అధ్యక్షులు, టీడీపీ మండల అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు, బీవీ టీమ్ సభ్యులు, ట్రాక్టర్ యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీ సమస్యల పరిష్కారానికి చర్యలు

త్వరలో మసీదులు, ఉర్దూఘర్, షహీద్‌ఖానాను సందర్శిస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి హామీ





ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 23,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)ముస్లిం మైనారిటీ వర్గాల సమస్యలను పరిష్కరించడంతో పాటు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ ప్రతినిధులు, మసీదులు, ఈద్గా కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని మైనారిటీ ప్రాంతాల్లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. జామియా మసీదు, మైనారిటీ కాలనీ మసీదు, కర్నూలు బైపాస్ రోడ్డులోని షహీద్‌ఖానా, ఉర్దూఘర్‌కు కనెక్టివిటీ రోడ్డు, కబరస్తాన్‌కు కాంపౌండ్ వాల్, నీటి సౌకర్యం, అలాగే సోమగూరు రోడ్డులోని కమ్యూనిటీ స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం తదితర అంశాలను కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.కమ్యూనిటీ ప్రతినిధులు తెలిపిన సమస్యలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పరిశీలించారు. సంబంధిత అధికారులతో పాటు కమిటీ ప్రతినిధులతో సమన్వయం చేసుకుని సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.త్వరలోనే జామియా మసీదు, మైనారిటీ కాలనీ మసీదు, ఉర్దూఘర్, షహీద్‌ఖానా తదితర ప్రాంతాలను స్వయంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కమ్యూనిటీ కమిటీల సహకారంతో పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.మైనారిటీ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, కాంపౌండ్ వాల్ తదితర మౌలిక సదుపాయాలపై వచ్చిన ప్రతిపాదనలను సంబంధిత శాఖల అధికారులతో చర్చించి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు స్థానిక ప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, జామియా మసీదు అధ్యక్షులు, జమాతే అహ్లెహదీస్ మసీదు, హాఫిజ్ మసీదు, సుల్తాన్ మసీదు, నూరాని మసీదు కమిటీ సభ్యులు, టీడీపీ పట్టణ మైనారిటీ నాయకులు, ముస్లిం కమ్యూనిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ పై సమరభేరి

అనంతలో మహా చైతన్య ర్యాలీ -మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

మహాజన సామాజిక అభ్యుదయ సమాజ్ (ఎంఎస్‌పీఎస్), మహాజన విద్యార్థి సంఘం (ఎంవీఎస్)





అనంతపురం క్రైమ్, సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):
డ్రగ్స్ మహమ్మారిపై సమాజం సమష్టిగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందంటూ అనంతపురం నగరంలో మహా చైతన్య ర్యాలీ నిర్వహించారు. యువత, విద్యార్థుల్లో మత్తు పదార్థాలపై అవగాహన పెంచడంతో పాటు డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో మహాజన సామాజిక అభ్యుదయ సమాజ్ (ఎంఎస్‌పీఎస్), మహాజన విద్యార్థి సంఘం (ఎంవీఎస్) ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు.ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శాంతకుమార్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, టౌన్ డీఎస్పీ చంద్రశేఖర్, డీఆర్వో మాలోల, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కే.పీ. నారాయణస్వామి, బీజేపీ నాయకుడు లలిత్‌కుమార్, ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చక్రధర్ యాదవ్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. రాజశేఖర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మాలోబులు తదితరులు హాజరయ్యారు.



అంశాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలి
ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అనంతపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు, దాడులు నిర్వహిస్తూ మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలను అడ్డుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. డ్రగ్స్ కట్టడిలో పోలీసుల చర్యలతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా అత్యంత కీలకమని వక్తలు సూచించారు. విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎవరితో స్నేహం చేస్తున్నారు.. వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు వస్తున్నాయా అనే అంశాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు.

సామాజిక ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలి
పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను తెలుసుకుంటూ సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. చదువు, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టి తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. స్నేహితుల ప్రభావం లేదా ఇతర కారణాలతో మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డ్రగ్స్ రహిత నిర్మాణంలో ప్రతి కుటుంబం, ప్రతి విద్యార్థి, ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు డ్రగ్స్‌పై సామాజిక ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గురుస్వామి, రాష్ట్ర కార్యదర్శి టీ. రాందాస్, ట్రెజరర్ కృష్ణ, జిల్లా కార్యదర్శి నాగరాజు, శ్రీకాంత్, వేణు,ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడులు చేస్తే సహించం

వైసీపీ నేతలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరిక

ఉపాధ్యాయులపై భౌతిక దాడులు దుర్మార్గం

చట్టబద్ధంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

అనంతపురం రామ్ నగర్, సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):
విజయవాడ శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై వైసీపీకి చెందిన వ్యక్తులు భౌతిక దాడికి పాల్పడిన ఘటనను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఉపాధ్యాయుల జోలికి వస్తే టీడీపీ కార్యకర్తలు అడ్డుకుంటారని హెచ్చరించారు. అనంతపురంలోని అర్బన్ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాల్సిన వారు ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైసీపీ హింస, దౌర్జన్యాలు, దాడులు చేసేందుకు పన్నాగం పన్నుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి



నారా లోకేష్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ నియామకాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో డీఎస్సీ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అర్హతలు, సర్టిఫికెట్ల పరిశీలనపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాల్సింది పోయి రోడ్లపై దాడులకు దిగడం సరికాదన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు ఎదుర్కొన్న ఇబ్బందులను కూడా దగ్గుపాటి ప్రసాద్ ప్రస్తావించారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై దాడులకు పాల్పడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.విజయవాడలో జరిగిన ఘటనను కేవలం ఉపాధ్యాయులపై దాడిగా కాకుండా రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నంగా ఎమ్మెల్యే అభివర్ణించారు. రాష్ట్రంలో అశాంతి, రౌడీయిజాన్ని ప్రభుత్వం ఎంతమాత్రం సహించదని స్పష్టం చేశారు. దాడులకు పాల్పడిన వారు చట్ట ప్రకారం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు.

అందోలు-జోగిపేట 16వ వార్డులో అర్హులకు ‘చేయూత’ పెన్షన్ల పత్రాల పంపిణీ

వితంతు, వికలాంగ, వృద్ధాప్య పెన్షన్ పత్రాలు అందజేసిన కౌన్సిలర్ పట్లోళ్ల శ్రీనివాస్

సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూస్తామని వెల్లడి



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)
అందోలుజోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ‘చేయూత’ పథకం కింద నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు వితంతు, వికలాంగ, వృద్ధాప్య పెన్షన్ మంజూరు పత్రాలను వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల శ్రీనివాస్ అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ పట్లోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదలకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో చేరేలా చూడటమే తన ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. వార్డు పరిధిలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

పెన్షన్ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు:
రుమాండ్ల చరిత, మహాజబీన్, రోషిని దేవి, బిట్టు మంజు, చుట్టకుల సుభాష్, గౌడెల్లి ఉమారాణి, ఎం.డి. పాషా, అవుసలి పూజ, శబనా బేగం, సులుగంటి ఝాన్సీ, కన్నా సంగీత, చెర్ల ప్రభావతి.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

అమ్మ పేరుతో మొక్కలు.. పచ్చని భవిష్యత్‌కు బాటలు!

జోగిపేట ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో ‘ఏక్ పేడ్ మా కే నామ్’

తల్లుల పేర్లతో మొక్కలు నాటి.. సంరక్షణ బాధ్యత తీసుకున్న చిన్నారులు





సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)
జోగిపేట--ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన ‘ఏక్ పేడ్ మా కే నామ్’ కార్యక్రమంలో భాగంగా జోగిపేట ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. చిన్నారులు తమ తల్లుల పేర్లతో మొక్కలు నాటి, వాటికి నీరు పోసి సంరక్షణకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడమే నిజమైన బాధ్యత అని విద్యార్థులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించేందుకు మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.
“అమ్మ పేరుతో నాటిన మొక్క.. భవిష్యత్ తరాలకు పచ్చని కానుక” అనే సందేశంతో విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లాలో డీజేలు నిషేధించాలని పోలీసులను కోరుతున్నా

ఐహెచ్ఆర్ పిసి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడేపు రాజమౌళి

రాయికల్ మండలంద
సెప్టెంబర్,23(రిపబ్లిక్ న్యూస్)
జగిత్యాల జిల్లాలో గణేష్ నిమజ్జనంలో డీజే లు నిషేధించాలని ఈ డీజే లతో గుండెపోటు వస్తున్నాయని యువత ప్రజలు ఆలోచించి నిర్ణయము తీసుకోవాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి కోరారు మంచి భక్తిశ్రద్ధలతో నిర్వర్తించుకోవాలని తల్లిదండ్రుల పేరు కాపాడుతూ ప్రజల మందనాలు పొందాలని కోరుతున్నాము గణేష్ నిమజ్జనా సమయంలో శోభయాత్రలో డాన్స్ చేస్తూ ఈమధ్య చాలామంది మరణించడం జరుగిశీదని దీన్ని వెంటనే కొంతమంది యువత ఆలోచించాలని మనమంత కలిసిమెలిసి దైవము దేవుని పాటలతో నిదానంగా



ఆడుతూ పాడుతూ హ ఆహ్లాదంగా ఉండి బిజీ మోతలు లేకుండా డీజే లను నిషేధించుకోవాలని కోరుకుంటున్నారు దీనికి మనమంతా ఒక తాటిపై



నిదబడాలని మనమంతా అన్ని గ్రామాలు అన్ని పట్టణాలు డీజే లను నిషేధించుకోవాలని మనమే తీర్మానించుకొని మంచి క్రమశిక్షణతో ఉండాలని కోరుతున్నాను గుండెపోటు అధిక ముప్పు శబ్దం వల్ల బిపి గుండె వేగము ఒక్కసారిగా పెరిగి గుండెపోటు వచ్చే అవకాశం ఉంది వృద్ధులకు గర్భిణీ స్త్రీలకు చిన్న పిల్లలకు చెవుడు మెదడుపై ప్రభావము ఉంటదని ఆడెపు రాజమౌళి తెలిపాడు డీజే కు బదులు సంప్రదాయ భజనలు కోలాటాలతో గ్రూప్ డాన్స్ లతో మంచి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం జరుపుకోవాలని నిబంధనలు అతిక్రమించకుండా ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా ఉండకూడదని ప్రజల ప్రశంసాలు పొందాలని కోరుతున్నాము ప్రతి ఒక్కరు డీజే లు నిషేధించుకోవాలని మనమంతా ఐక్యమత్యంతో గణేష్ నిమజ్జనం మంచి భక్తిశ్రద్ధలతో పాటిస్తూ ఉండాలని ప్రతి ఒక్కరూ అనుకోని మనమంతా మంచిగా ఉండాలని ఆడెపు రాజమౌళి కోరారు

ఘనంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానం

మహమ్మద్ షకీల్ (లడ్డు) ఆధ్వర్యంలో వేడుకలు



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్) ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ షకీల్ (లడ్డు) ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఏఎంసీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకటేశం, జీవన్, అమెన్, రాజ్‌కుమార్, ప్రశాంత్, ఖాదర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ మార్కండేయ ఆలయంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ఆకట్టుకునే సాంస్కృతిక ప్రదర్శన



రాయికల్ మండలం సెప్టెంబర్,22(రిపబ్లిక్ న్యూస్)
జగిత్యాల జిల్లా రాయికల్ మార్కండేయ ఆలయంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో భాగంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్, రాయికల్ విద్యార్థులు మంగళవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరిస్తూ విద్యార్థులు శివుడు, పార్వతీదేవి, వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, కుమారస్వామి, విష్ణుమూర్తి తదితర దేవతల వేషధారణలో పాల్గొన్నారు. వినాయకుని జన్మవృత్తాంతం, విశిష్టతను నాటక రూపంలో ప్రదర్శించి భక్తులకు వివరించారు.అనంతరం భక్తి గీతాలకు చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను పఠిస్తూ, వాటి భావాలను సులభంగా వివరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల ప్రతిభను భక్తులు, కార్యక్రమ నిర్వాహకులు అభినందించారు.కార్యక్రమం అనంతరం పద్మశాలి సేవా సంఘం సభ్యులు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యాన్ని సత్కరించి బహుమతి అందజేశారు. విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, భక్తులు, పద్మశాలి సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)
ఆందోల్ మండలం జోగిపేటలోని మాణిక్ ప్రభు మందిరంలో తొమ్మిది రోజులుగా నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. రమణ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భక్తులు భజనలు, భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అనంతరం భక్తుల కోలాహలం, భక్తి గీతాలు, నృత్యాల మధ్య వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మాజీ చైర్మన్ కవిత సురేందర్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్ రేఖా ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు. నాందేడ్ నుంచి వచ్చిన కళాకారుల భక్తి పాటలు, నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పరిహారంతో ‘పంట’ పండింది

ట్రాన్స్‌మిషన్ టవర్‌తో నష్టం లేదు -అపోహలు వీడాలని రైతు అనిల్ సూచన






కణేకల్లు వ్యవసాయం, సెప్టెంబర్23,(రిపబ్లిక్ న్యూస్):
విద్యుత్ హైపవర్ ట్రాన్స్‌మిషన్ టవర్ ఏర్పాటుతో తన భూమికి ఎలాంటి నష్టం జరగలేదని కణేకల్లు మండలం తుంబిగనూరుకు చెందిన యువరైతు అనిల్ తెలిపారు. టవర్ నిర్మాణానికి పరిహారం అందిందని, ఆ మొత్తాన్ని పంట పెట్టుబడులకు వినియోగించుకున్నానని చెప్పారు. టవర్ ఏర్పాటైనా భూమిలో యథావిధిగా సాగు కొనసాగిస్తున్నట్లు వివరించారు.
తన పొలంలో టవర్ ఏర్పాటైన తర్వాత కూడా మొక్కజొన్న సాగు చేసినట్లు అనిల్ తెలిపారు. పంట తొలగింపు సమయంలో టవర్ కింద పెద్ద యంత్రాలతో పనులు చేసినా ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదన్నారు. టవర్ నిర్మాణం జరిగితే వ్యవసాయం చేసేందుకు అవకాశం ఉండదనే అభిప్రాయం సరికాదని తన అనుభవం ద్వారా స్పష్టం చేశారు.వ్యవసాయానికి విద్యుత్ ఎంతో అవసరమని అనిల్ పేర్కొన్నారు. కరెంటు కొరత సమయంలో రైతులు పడిన ఇబ్బందులు అందరికీ తెలిసిందేనన్నారు. రైతులకు విద్యుత్ అందాలంటే అవసరమైన విద్యుత్ మౌలిక వసతులు ఉండాల్సిందేనని చెప్పారు. విద్యుత్ కొరత వల్ల మొదట ఇబ్బంది పడేది రైతులేనని పేర్కొన్నారు.
రైతులకు విద్యుత్ అందించేందుకు అవసరమైన ట్రాన్స్‌మిషన్ టవర్ల నిర్మాణాన్ని వ్యతిరేకించడం సరికాదని అనిల్ అన్నారు. రైతులకు ఉపయోగపడే విద్యుత్ మౌలిక వసతుల కోసం తన పొలంలో కొంత భూమిని ఇవ్వడానికి కూడా వెనుకాడబోనని స్పష్టం చేశారు. టవర్ల విషయంలో రైతులు అపోహలకు లోనుకాకుండా వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. “పరిహారంతో పంట పండింది” అని తన అనుభవాన్ని వివరించారు.

శ్రీమల్లికార్జున వినాయకుడి లడ్డూలకు భారీ ధరలు

రూ.55 వేలతో తొలి లడ్డూను దక్కించుకున్న గడ్డం జనార్దన్

రూ.34 వేలతో రెండో లడ్డూను సొంతం చేసుకున్న నర్సమ్మ కార్తీక్





సంగారెడ్డి జిల్లా ప్రతినిధిసెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్) ఆందోల్ ---మండలం నేరడిగుంట గ్రామంలో శ్రీమల్లికార్జున యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా లడ్డూల వేలం నిర్వహించారు. ఈ వేలంలో తొలి లడ్డూను గడ్డం జనార్దన్ (చింటూ) రూ.55 వేలతో దక్కించుకున్నారు. రెండో లడ్డూను నర్సమ్మ కార్తీక్ రూ.34 వేలతో సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా గడ్డం జనార్దన్ మాట్లాడుతూ, తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడి లడ్డూను పొందడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన శ్రీమల్లికార్జున యువజన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం లడ్డూలను దక్కించుకున్న గడ్డం జనార్దన్, నర్సమ్మ కార్తీక్‌లను శ్రీమల్లికార్జున యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కూటమి ఓటమే మన లక్ష్యంగా పని చేద్దాం...

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి..



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)
నంద్యాల పట్టణం నడిగడ్డలోని కేకే ఫంక్షన్ నందు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని1వార్డు నుండి 13 వార్డులలో వున్నా పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ భాషా దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను సమన్వయంతో ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు.
పార్టీ బలోపేతం, ప్రజలతో నిరంతర సంబంధాలు, స్థానిక సమస్యలపై అవగాహనతో ముందుకు సాగాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి విజయానికి కృషి చేయాలని శిల్పా రవి రెడ్డి కోరారు.
రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ దేశం సుధాకర్ రెడ్డి, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మాజీ కౌన్సిలర్లు మునయ్య,సాదిక్ బాషా,సమద్,అరిఫ్ నాయక్,గౌస్,చాంద్ బీ,కలం భాషా,తమీమ్,దండె సుధాకర్, జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా వైసీపీ సెక్రటరీ శివ నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి,నేరవాటి రవికుమార్, గన్ని కరీం, దండే శ్రీను, కాల్వ నాగరాజు మరియు వార్డు వైసిపి నాయకులు ఇంచార్జిలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా
ఉచిత వైద్య శిబిరం ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

పెద్ద ఎత్తున ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న అధికారులు

ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్య విజ్ఞానంలో ముఖ్యమైన భాగం

ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా

ప్రతి ఒక్కరు ఒత్తిడిని జయించి విశ్రాంతి తీసుకోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలి : జిల్లా ఆయుష్ అధికారి యశోద







నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)

ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్య విజ్ఞానంలో ముఖ్యమైన భాగశే అని సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలపై ప్రతి ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యుల సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ లోనే పి జి ఆర్ ఎస్ హాలు నందు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం బుధవారం జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హెచ్ బి, బోన్ డెంటిస్ట్ వంటి తదితర టెస్టులు చేయించుకున్న అనంతరం వైద్యులు జిల్లా కలెక్టర్ కు మందులు అందజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయుర్వేదం, ఆయుష్ వైద్య విధానాల ప్రాధాన్యతను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లైఫ్ సైన్స్ విద్యార్థిగా డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న సమయంలో బోటనీ, మెడిసిన్ తదితర సబ్జెక్టుల ద్వారా ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి, యునాని, సిద్ధ వంటి వివిధ వైద్య విధానాల గురించి తెలుసుకున్నానని తెలిపారు. ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్య విజ్ఞానంలో ముఖ్యమైన భాగమని తెలిపారు. ప్రస్తుత ఆధునిక జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఉద్యోగులు ఎక్కువ సమయం కార్యాలయాల్లో కూర్చుని పనిచేయడం, సుదీర్ఘ గంటల పాటు పనిచేయడం, వేళకు ఆహారం తీసుకోకపోవడం, రాత్రి వేళల్లో ఎక్కువసేపు మేల్కొని ఉండటం వంటి అలవాట్ల వల్ల నడుము నొప్పి, డిస్క్ సంబంధిత సమస్యలు, జుట్టు రాలడం, గొంతు సమస్యలు తదితర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, నడుము మరియు డిస్క్ సంబంధిత సమస్యల ఉపశమనానికి డాక్టర్ యశోధర సూచించిన కర్పూర తైలం ఉపయోగించడం ద్వారా ప్రయోజనం పొందినట్లు తెలిపారు. అలాగే నిద్రకు సంబంధించిన ఇబ్బందులు, మానసిక ఒత్తిడి వంటి సమస్యల విషయంలో ఆయుర్వేద వైద్యుల సలహా మేరకు అశ్వగంధ చూర్ణం ఉపయోగించారని తెలిపారు. పసుపు, ఉసిరి వంటి సహజ పదార్థాలకు ఆయుర్వేదంలో ఉన్న ప్రాధాన్యతను జిల్లా కలెక్టర్ వివరించారు. గొంతు సంబంధిత సమస్యలకు సీతోఫలాది చూర్ణం వంటి ఆయుర్వేద ఔషధాలను వైద్యుల సలహాతో వినియోగించడం ద్వారా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే స్వయంగా టాబ్లెట్లు తీసుకోవడం, అవసరం లేకపోయినా అధిక మొత్తంలో మందులు కొనుగోలు చేసి సగం ఉపయోగించి వృథా చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించి, అవసరమైన చికిత్స మేరకు మాత్రమే తీసుకోవాలని తెలిపారు. ఆయుర్వేదం సహా వివిధ వైద్య విధానాలను వైద్యుల సూచనల మేరకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజలు కుటుంబ సమేతంగా ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యుల సలహాలు, అవసరమైన ఔషధాలను ఉచితంగా పొంది శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ధన్వంతరి యంత్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జిల్లా ఆయుష్ అధికారి మాట్లాడుతూ..వయస్సు పెరుగుతున్న కొద్దీ జీవనశైలి, ఒత్తిడి, హార్మోన్లలో వచ్చే మార్పుల కారణంగా ఎముకల సాంద్రత తగ్గే అవకాశం ఉంటుందని, నడుము, మెడ, మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. వయస్సునునియంత్రించలేక పోయినా, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

ప్రాచీన ఆయుర్వేదంలో ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఆహారంతో పాటు సామాజిక ప్రవర్తన, ఒత్తిడి లేని జీవనం, పెద్దల సలహాలను పాటించడం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో అవసరమని అన్నారు.

ప్రతి పనిని ఇష్టపడి, సానుకూల దృక్పథంతో స్వీకరించినప్పుడు మానసిక ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. దీర్ఘకాలిక ఒత్తిడి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఒత్తిడిని నియంత్రించుకోవడం, తగిన విశ్రాంతి తీసుకోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు.

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చే వారిలో నడుము,మెడ, మోకాళ్ల వంటి కీళ్ల నొప్పులు, మధుమేహ సమస్యలతో వస్తున్నట్లు వైద్యుల పరిశీలనలో వెల్లడైందని తెలిపారు. ఆయుర్వేద వైద్య విధానంలో ఆరోగ్య పరిరక్షణకు, వ్యక్తి శారీరక పరిస్థితికి అనుగుణంగా చికిత్సా విధానాలను అనుసరిస్తారని వైద్యులు నొప్పులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు స్వయంగా మందులు వినియోగించకుండా అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు చికిత్స పొందాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో ఆయుర్వేదంలో వినియోగించే ప్రత్యేక తైలాలు, ఇతర చికిత్సా విధానాలను వైద్యుల సలహాతో మాత్రమే ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం నందు నాడీ పరీక్ష , బోన్ మినరల్ డెంటిస్ట్, హెచ్ బి తదితర టెస్టులు చేయించుకున్న వారిని వైద్యుల సలహా మేరకు ప్రతి ఒక్కరికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆయుర్వేద, హోమియో వైద్యులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బయోచార్‌తో భూసార పరిరక్షణకు ప్రాధాన్యత





పంట అవశేషాలను సద్వినియోగం చేసుకుని రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

నంద్యాల జిల్లాలో తొలిసారిగా పైలట్ ప్రాజెక్టుకు కార్యాచరణ

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)

భూసార పరిరక్షణతో పాటు పంట అవశేషాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. నంద్యాల జిల్లాలో ఈ తరహా కార్యక్రమాన్ని తొలిసారిగా చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆమె అధికారులను, సంబంధిత కోర్ టీమ్ సభ్యులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బయోచార్ వినియోగం, భూసార పరిరక్షణ, పంట అవశేషాల సద్వినియోగంపై సంబంధిత కోర్ టీమ్‌తో జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా బయోచార్ తయారీ విధానం, వ్యవసాయ భూముల్లో దాని వినియోగం, రైతులకు కలిగే ప్రయోజనాలపై సమగ్రంగా చర్చించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణంలోకి కార్బన్ ఉద్గారాలు పెరిగే అవకాశం ఉన్నందున, వాటిని సద్వినియోగం చేసుకునే ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. 'కోంటికి' వంటి పరికరాలను ఉపయోగించి ఆక్సిజన్ పరిమిత పరిస్థితుల్లో పంట అవశేషాలను ప్రాసెస్ చేసి బయోచార్‌గా మార్చే విధానాన్ని పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. బయోచార్‌ను తగిన మోతాదులో సేంద్రియ ఎరువులతో కలిపి వ్యవసాయ భూముల్లో వినియోగించడం ద్వారా నేల నాణ్యత, సేంద్రియ పదార్థాల స్థాయిని మెరుగుపరిచే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. భూసార పరిరక్షణతో పాటు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నంద్యాల జిల్లాలో తొలిసారిగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించి, దాని ఫలితాలను శాస్త్రీయంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఫోర్ రెడ్డి ఫౌండేషన్, క్లైమిత్ర అండ్ సర్కులారిటీ బయో తరఫున జిల్లావ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు రూపొందించాల్సిన ప్రతిపాదనలను వారం రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. కోర్ టీమ్ సభ్యులు అందించే సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని, రాబోయే 3 నుంచి 6 నెలల్లో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో కార్యక్రమాన్ని అమలు చేసి, దాని ఫలితాలను అంచనా వేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. బయోచార్ నేలలో కార్బన్‌ను స్థిరీకరించడంతో పాటు దీర్ఘకాలికంగా నేల నాణ్యతను మెరుగుపరిచే సామర్థ్యం కలిగి ఉందని వివిధ అధ్యయనాలు సూచిస్తున్న నేపథ్యంలో, నంద్యాల జిల్లాలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా దీని వినియోగ సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక ప్రాజెక్టుగా కాకుండా పంట అవశేషాల నిర్వహణ, భూసార పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణను అనుసంధానించే సమగ్ర చర్యగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత కంపెనీల ప్రతినిధులు రాజశేఖర్ రెడ్డి, అంకిత శర్మ, రవిచంద్ర, నాబార్డ్ ఏజీఎం కార్తికేయ, ఎల్డియం అయ్యప్ప రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో వైభవంగా ముగిసిన
వినాయక నిమజ్జనం

హంద్రీనీవాలో 1,050.. వినాయక ఘాట్‌లో 1,000కు పైగా.. ఉలిందకొండలో 96 విగ్రహాల నిమజ్జనం



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 23)



కర్నూలు నగరంలో వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా, ప్రశాంతంగా ముగిశాయి. నగరంలోని వినాయక ఘాట్‌తో పాటు నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలోని హంద్రీనీవా, ఉలిందకొండ ప్రాంతాల్లో భారీ సంఖ్యలో గణనాథుల విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో నిమజ్జన ప్రాంతాలు సందడిగా మారాయి.

కర్నూలు జిల్లాలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాల ఏర్పాటుపై మంత్రి టీజీ భరత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హంద్రీనీవాలో నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించడంతో అధికారులు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టారు.

అర్ధరాత్రి తర్వాత పెరిగిన రద్దీ

అర్ధరాత్రి తర్వాత హంద్రీనీవా వద్దకు వినాయక విగ్రహాల రాక భారీగా పెరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ గణనాథులను ఊరేగింపుగా తీసుకొచ్చిన భక్తులు హంద్రీనీవాలో నిమజ్జనం చేశారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భారీ విగ్రహాలతో వాహనాలు వరుసగా రావడంతో నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలో సందడి నెలకొంది.

మూడు ప్రాంతాల్లో భారీగా నిమజ్జనం

నన్నూరు టోల్‌ప్లాజా వద్ద హంద్రీనీవాలో 1,050 వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. కర్నూలు నగరంలోని వినాయక ఘాట్ వద్ద కేసీ కెనాల్‌లో 1,000కు పైగా విగ్రహాలు, ఉలిందకొండ వద్ద 96 విగ్రహాలు నిమజ్జనం చేశారు. హంద్రీనీవాలో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిమజ్జన కార్యక్రమం కొనసాగింది.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. భారీ విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించారు.

నీటి కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలను సిద్ధం చేయడం ద్వారా భక్తులకు సౌకర్యం కల్పించారు. హంద్రీనీవా, కేసీ కెనాల్, ఉలిందకొండ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను భక్తులు వినియోగించుకున్నారు.

మొత్తంగా కర్నూలు నగరంలో వినాయక నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. అధికార యంత్రాంగం, పోలీసులు, వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగింది.

CHANGE OF NAME

I, Shaik Akbar Bee W/o.Hussain Basha , R/o of H.No:25-450-1-B121, Nandamuri Nagar, Nandyal, Andhra Pradesh, have Changed the name of my minor daughter **from Shaik Nabishath Bi to Shaik Ayesha Tabassum** for all future purposes.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com